

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 11 | జూలై 2026

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఈ సంచికలో. . . .

గురుపూర్ణిమ ........................................................ 2


గురువు మనతోనే ఉంటాడు – మనలను విడిచిపెట్టడు ..... 7

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు .............. 10

మహాత్ముల ప్రేమ .............................................. 27

ఇతర విషయములు :


చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



గురువు అంటే శాంతి, ఆనందం, అనుగ్రహం. గురువు ఏమి చేసినా ఆనందమే. ఆయన కదలికలు అన్నీ ఆనందమే. ఎందుచేతనంటే ఆనందమే ఆ రూపం ధరించి వచ్చింది.

# గురుపూర్ణిమ

– పి. సంధ్య, హైదరాబాద్



ఆషాఢమాసంలో వచ్చే గురుపౌర్ణమి రోజున గురువుని గౌరవించి, ఆయన వైభవం చెప్పుకోవటం వల్ల, మనకి మనస్సు పవిత్రమవుతుంది, ఆయన అనుగ్రహం మన మీద వర్షిస్తుంది. గురుపరంపరలో ముందుగా వ్యాసుడు గురించి, వాల్మీకి గురించి నాన్నగారు చెప్పేవారు. ఆ మహాత్ములు ద్వారానే ఇవన్నీ వచ్చినవి కాబట్టి మన పూర్వీకులు వ్యాసుడి యొక్క జన్మదినాన్ని గురుపౌర్ణమిగా నిర్ణయించారు. గురు పౌర్ణమి రోజున ముందుగా వ్యాసుడికి, వాల్మీకికి నమస్కరించి, కృతజ్ఞతలు చెప్పుకొని, తరువాతే మిగిలినవి చెప్పుకోవాలి అనేవారు నాన్నగారు.

మనలను అనుగ్రహించడానికి భగవంతుడే గురువుగా భూమి మీదకి ఒక శరీరం తీసుకొని వస్తాడు. మహాశివుడు దక్షిణామూర్తిగా వచ్చి, మౌనభాషని అందుకోగలిగే అర్హత ఉన్న సనత్‌కుమారుడు వాళ్లందరికీ జ్ఞానానుభవాన్ని అనుగ్రహించారు. అవతారపురుషుడు అయిన కృష్ణుడు భగవద్గీతని బోధించి అందరినీ అనుగ్రహించటం వల్ల, ఆయనని జగద్గురువుగా స్మరించుకుంటాము. భగవద్గీతలో ఒక్క మాట అర్థం అయినా జ్ఞానం వచ్చేస్తుంది అని మహాత్ములంతా మనకి చెప్పారు. ఎందరో మహాత్ములు భూమి మీదకి వచ్చి మానవులకు ఆత్మజ్ఞానాన్ని బోధించి అనుగ్రహిస్తున్నారు. ఒకో దేహం ద్వారా ఒక్కొక్కటి జరుగుతూ ఉంటుంది.

గౌతమబుద్ధుడు గురుపౌర్ణమి రోజునే బోధ మొదలుపెట్టారని నాన్నగారు చెపుతూ ఉండేవారు. మొదటిసారిగా ఊరూరూ తిరిగి బోధించినది బుద్ధుడు. ఆయనకి జ్ఞానం వచ్చాక, అంతకుముందు ఆయనతో ఎవరైతే కలిసి ఉన్నారో, వాళ్లకోసం వెళ్లి అక్కడినుంచి ఆయన బోధని మొదలుపెట్టారు. ఆదిశంకరాచార్యులు అప్పటివరకు ప్రాచుర్యంలో లేని భగవద్గీతని మనకి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయన దేశం అంతా తిరిగి, అనేక గ్రంథాలు రాసి, ఆత్మజ్ఞానాన్ని బోధించి, అనేక మఠాలు స్థాపించి హిందూమత ఉద్ధరణ చేసినటువంటి గురువు కాబట్టి ఆచార్యులవారిని కూడా జగద్గురువుగా కొలుస్తాము. భగవాన్ రమణమహర్షి అరుణాచలం వచ్చి అక్కడ నుండి ఎటూ వెళ్ళలేదు. యాత్రలతోటి యజ్ఞాలతోటి మనస్సు బాహ్యాముఖము అయిపోకుండా, మనకి అంతర్యామిగానే భగవంతుడు ఉన్నాడు అని మన మనసుని అంతర్ముఖ పరచటానికి భగవాన్ ఈ భూమి మీదకి వచ్చారు. దక్షిణామూర్తి యొక్క మౌనభాష మనకి అందదు కాబట్టి మళ్లీ భగవాన్ మనకి మాటల రూపంలో బోధించారు.

ఇలా ఎప్పటికప్పుడు ఈశ్వరుడు గురురూపంలో మానవజాతిని అనుగ్రహిస్తూనే ఉన్నాడు. దక్షిణామూర్తిగా శివుడు, అవతారపురుషులుగా రాముడు కృష్ణుడు, తరువాత గౌతమ బుద్ధుడు, శంకరాచార్యులు ఈ భూమి మీదకి వచ్చి అనేకమందిని ఉద్ధరించి వాళ్ల వైభవం చూపించారు. ఈమధ్యకాలంలో మనకోసం దేహం తీసుకొని ఈ భూమి మీదకి గురువులుగా వచ్చినటువంటి రమణమహర్షి, రామకృష్ణుడు, నాన్నగారు కూడా అవతార పురుషులే. గురుపరంపరలో అటువంటి గురువులందరికీ మనం నమస్కరించి వాళ్ళకి కృతజ్ఞత చెప్పుకొని తరువాత నాన్నగారి మాటలని చెప్పుకోవాలని మనకి నేర్పించారు.

గురువు యొక్క అనుగ్రహం గురించి నాన్నగారు చక్కగా చెప్పారు. గురువు చూపు ద్వారా ఆయన అనుగ్రహం మన మీద వర్షించినప్పుడు, ఆ అనుభవం మన చేతిని మనం స్పర్శిస్తే ఆ స్పర్శ ఎంత స్పష్టంగా ఉంటుందో అంత స్పష్టంగా మన హృదయానికి తాకుతుంది. ఒక జ్ఞాని గురురూపంలో భూమి మీదకి వచ్చినప్పుడు, తన కాంతిని శాంతిని జీవులపై

వర్షింప చేస్తాడు. సూర్యుడు వచ్చినప్పుడు డైరెక్టుగా ఆయన కిరణాలని మనం ఎలా అనుభవిస్తామో అంతే స్పష్టంగా నాన్నగారి యొక్క అనుగ్రహం మన హృదయానికి తాకినప్పుడు మనము డైరెక్టుగా అనుభవించాము.

జ్ఞాని అయిన గురువుని చూసినప్పుడు మాత్రమే భగవంతుడు ఉన్నాడనే చలించని విశ్వాసం సజీవమైన విశ్వాసం వస్తుంది. నాన్నగారు మన జీవితాలలో ప్రవేశించక ముందు భగవంతుడు ఎక్కడో వైకుంఠంలో ఉన్నాడు, గుళ్లో ఉన్నాడు, తిరుపతిలో ఉన్నాడు అనుకునే వాళ్ళము. కానీ నాన్నగారు వచ్చాక, భగవంతుడు ఎక్కడో లేడు, హృదయంలోనే అంతర్యామిగా ఉన్నాడు అని సజీవమైన భక్తి, సజీవమైన విశ్వాసం మనకి అనుభవానికి తీసుకొచ్చారు.

బాహ్యంగా తిరుగుతున్న మనసుని అంతర్ముఖ పరచటానికే గురువు భూమి మీదకి వస్తాడు. లేకపోతే గురువుకి శరీరం అవసరం లేదు. నాన్నగారు, భగవాన్, రామకృష్ణుడు, బుద్ధుడు, రాముడు, కృష్ణుడు, వీళ్లందరూ వచ్చి మనలోపల ఉన్న స్వరూపస్థితే భగవంతుడు, భగవంతుడి యొక్క అంశే మనము అనేది మనకి అనుభవానికి తీసుకొచ్చారు. ఎన్ని సాధనలు, పూజలు చేసినా మనస్సు అడ్డు ఉన్నంతకాలం ఆ స్ఫురణ అందదు. కానీ జ్ఞాని ఒక్క చూపుతోటి మనకి అంతర్యామిగా ఉన్నవాడు అనుభవంలోకి వస్తాడు. అది జ్ఞాని యొక్క వైభవం. ఆయన ఒక్క మాట సరిపోతుంది, ఒక్క చూపు సరిపోతుంది. ఆ చూపు వల్ల అప్పటిదాకా మనం ఎంతో అశాంతిగా ఉన్నప్పటికీ, అంతర్యామిగా ఉన్నవాడి స్ఫురణ ఇవ్వటం వల్ల ఒక్కసారిగా మనకి శాంతి వచ్చేస్తుంది, విశ్వాసం పెరుగుతుంది.

బయట మాటలతో బోధించటంతోపాటు లోపల అనుభవానికి తీసుకురావటం కూడా గురువే చేస్తాడు. మనము మాట, రూపము లేకపోతే అందుకోలేము కాబట్టి, మనకోసం ఒక రూపం తీసుకొని వచ్చి మనకు బోధించారు. ఆ దేహం వెళ్ళిపోయినా మనలో ఆత్మగా, చైతన్యంగా, అంతర్యామిగా ఉండి అనుగ్రహిస్తున్నారు. అందుకనే భగవాన్ కానీ, నాన్నగారు కానీ ఈ రోజు లేరు అనుకోము. ఆయన అంతర్యామిగా ఉన్నాడు కదా దేహం లేదు అంతే! ఆయన దేహమాత్రుడు కాదు. ఆయన అంతటా ఉన్నాడు, నీ

హృదయంలో ఉన్నాడు, నువ్వు పిలిస్తే పలుకుతున్నాడు.

మనలో ఉన్న చైతన్యస్థితి స్ఫురణ మనకి అప్పుడప్పుడూ ఉన్నప్పటికీ అది శాశ్వతం అవ్వదు. ఆ అనుభవం స్థిరపడకపోతే అది నిర్వాణస్థితి కాదు. అయితే మన లోపల ఉన్నటువంటి అలవాట్లు వాసనలు మనకి అడ్డు వస్తున్నాయి. వాసనాక్షయం అయినప్పుడు మాత్రమే ఆ చైతన్యస్థితి, ఆత్మస్థితి అనుభవంలోకి వచ్చి స్థిరపడుతుంది. వాటిని తొలిగించుకోకుండా వదిలివేస్తున్నాము కాబట్టి నాన్నగారు ఎక్కువగా వాసనారాహిత్యం. వాసనాక్షయం గురించి చెప్పారు. గురువుని స్మరించి, ప్రేమించి,ధ్యానించి, చిన్న ప్రయత్నం చేయటంవల్ల మనలో ఉన్న వాసనలన్నీ ఒక్కొక్కటీ రాలిపోతాయి. వాసనలని తొలిగించుకునే పని నువ్వు వివేకంతోటి చెయ్యి అని బుద్ధుడు చెప్పాడు.

గురువు చూపు ఒక్కసారి మన మీద పడితే ఆ అనుగ్రహం మనకు జ్ఞానం వచ్చేదాకా వదిలిపెట్టకుండా వెంటాడుతుంది. అటువంటి గురువు అనుగ్రహాన్ని లోకంలో మన సమస్యలతోటి మరచిపోయినప్పటికీ, అంతర్యామిగా ఉండి గుర్తుకు తీసుకువస్తుంటాడు. జ్ఞాని అయిన గురువుని ఆశ్రయించినప్పుడు, మన స్థూలబుద్ధిని తొలిగించి సూక్ష్మబుద్ధిని ఇస్తాడు. అంతర్యామిగా ఉండి మనకి వచ్చే ప్రతి తలంపుని చూస్తూవుంటాడు. ఏదైనా ఒక మంచి పని చేసినా, మంచి భావన వచ్చినా, అంతర్యామిగా ఉన్న భగవంతుడి అనుగ్రహం ద్వారానే వస్తోంది అనేది మనకి తెలియజేస్తాడు. గురువు ఇచ్చిన స్ఫురణ పట్టుకుంటే, ప్రతిస్పందన ఉంటే, ఆయన చెప్పే మాటలు విని, ఆచరించి అనుభవంలోకి తెచ్చుకుంటే మనకి జ్ఞానం వచ్చేస్తుంది.

నాన్నగారు ఏ ఆత్మస్థితిలో ఉన్నారో అక్కడికి మనని తీసుకువెళ్ళటం కోసం, మన స్థాయికి దిగి వచ్చి బోధించారు. ఏ మనస్సు కోసం, అహంకారం కోసమైతే మనం బ్రతుకుతున్నామో, అదే మనకు జ్ఞానం రాకుండా అడ్డు వస్తోంది. మనస్సులోని తలంపులే అశాంతిని తీసుకొస్తున్నాయి. నువ్వు నేను వారు అనుకునే వేరుబుద్ధే అజ్ఞానము అనేది నెమ్మదిగా ఎవరికి వారు పరిశీలించుకొని, మనంతట మనమే తెలుసుకునే వివేకాన్ని, బుద్ధిని

నాన్నగారు మనకిచ్చి, మనస్సులో ఉన్న వాసనలని తొలిగించుకునేటట్లుగా మనని అనుగ్రహించారు. వివేకం వైరాగ్యం రెండూ ఉంటేనే జ్ఞానం వస్తుంది. నిజమైన భక్తుడు సుఖాన్ని కష్టాన్ని కూడా ఒకేలాగ స్వీకరిస్తాడు. కష్టం వైరాగ్యాన్ని నేర్పిస్తుంది. కష్టాన్ని కూడా భగవంతుడి అనుగ్రహంగా తీసుకున్నప్పుడు వివేకంతోపాటు వైరాగ్యం వస్తుంది. గురువుని ఆశ్రయించి, ఆయన మీద భారం వేస్తే కష్టాలను భరించే శక్తిని ఇస్తాడు.

కబీరుదాసు గురువు కుమ్మరి వాడు. కుమ్మరివాడు మట్టిముద్దలని కుండగా మలిచినట్టు, మట్టిముద్దలవంటి జీవుల కర్మలని ఖర్చు చేసి, జ్ఞానులుగా తీర్చిదిద్ది గురువు తనలో ఐఖ్యం చేసుకుంటాడు. ఆయన దయాస్వరూపుడు, శాంతిస్వరూపుడు. గురుపౌర్ణమి రోజు గురువుని స్మరించుకొని, అంతకుముందు గురువులందరికీ కృతజ్ఞత చెప్పుకోవాలి. ఆ గురువులను గౌరవించటంతో పాటు, ఏ గురువు దేహం ద్వారా మనకి శాంతి, వివేకం వచ్చాయో, ఆ స్ఫురణని పట్టుకొని మనము లోపలికి ప్రయాణించి ఆయనను చేరుకోవాలి.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# గురువు మనతోనే ఉంటాడు – మనలని విడిచిపెట్టడు

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. నిరంతరము మన క్షేమమును కోరేవాడు, మన అభివృద్ధిని కాంక్షించే వాడు, మనకు ఆప్తుడు, నిజమైన బంధువు ఎవరు అంటే గురువే! మన క్షేమమును మనకంటే ఎక్కువగా గురువు కోరతాడు. జనన మరణ ప్రవాహంలో కొట్టుకునిపోతున్న మనలను బయటకులాగి జ్ఞానశిఖరాలకు తీసుకొనిపోవటానికి చూసేవాడే గురువు. గురువుని ప్రేమించటంలో మనకు హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి, కాని గురువు మనలను సమానంగా చూస్తాడు. మన హెచ్చుతగ్గులతో నిమిత్తం లేకుండా ఆయన ప్రేమను శాంతిని వర్షింపజేస్తాడు. గురువు ప్రేమస్వరూపుడు, శాంతి స్వరూపుడు. మనలను ద్వేషించాలన్నా ఆయన దగ్గర ద్వేషం లేదు. అక్కడ ఉన్నది ప్రేమ, శాంతి మాత్రమే కాబట్టి అవి తప్పించి ఇంకొకటి ఆయన ఇవ్వలేడు.

గురువు అంటే దేహమే అని మనము అనుకొంటున్నాము. గురువును ఆ దేహమునకు పరిమితం చేస్తాము. కాని గురువు దేహమునకు పరిమితమై ఉండడు. గురువు అంటే సద్వస్తువు, గురువు అంటే ఆత్మ. దేహములో ఉన్నా తాను దేహమాత్రుడను కాదు అని గురువుకు తెలుస్తూ ఉంటుంది. గురువు దేహమాత్రుడు కాదు కాబట్టి గురువు దేహం పడిపోయినా ఆయనతో మనకు ఉన్న సంబంధం కొనసాగుతూ ఉంటుంది.

భగవాన్‌ని ఒక భక్తుడు “భక్తి మార్గం అయినా కర్మ మార్గం అయినా సాధన అనేది, అన్వేషణ అనేది లోపల జరుగుతుంది కానీ బయట జరగదు. నేను లోపలే చేసుకొంటున్నాను అనుకోండి సాధన కాని గురువు బయట ఉన్నాడు. ఈ బయట గురువుల దగ్గర కూర్చుంటే ఏమైనా ఉపకారం ఉంటుందా?” అని అడిగితే భగవాన్ అన్నారు “బయట గురువు కూడా అవసరమే. నీకు ఉన్న అలవాట్లు, నీకు ఉన్న వాసనలు, నీకు ఉన్న పునర్జన్మ హేతువులు నశించే వరకూ నీకు బయట గురువు కూడా అవసరమే. సందేహం లేదు, అవసరమే! నువ్వు అన్వేషణ లోపల చేసుకోవచ్చు, నువ్వు లోపల చేసుకునే అన్వేషణకి బాహ్య గురువు

సపోర్ట్ ఇస్తాడు. ఎప్పుడైతే నువ్వు వాసనలను తొలిగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావో, బయట గురువు నీకు సహాయం చేస్తాడు. నువ్వు ఎక్కడ పుట్టినా, నువ్వు అమెరికాలో పుట్టిన, రష్యాలో పుట్టిన, ఏ ప్రాంతంలో పుట్టినా, ఏ దేశంలో పుట్టినా, ఏ కాలంలో పుట్టినా, బయట గురువు నిన్ను వెంటాడుతూనే ఉంటాడు. ఎప్పటివరకూ? నీ లోపలి గురువు దొరికేవరకూ నిన్ను వెంటాడుతూనే ఉంటాడు. ఆ లోపలి గురువే చైతన్యం. నీకు బంధువులతోటి సంబంధం తెగిపోతుంది, స్నేహితులతోటి సంబంధం తెగిపోతుంది. మరణంతో ఆ దేహానికి సంబంధించిన సంబంధాలు అన్నీ తెగిపోతాయి. కానీ గురువుతోటి మటుకు సంబంధం తెగదు. మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానమనే నిద్రలోనుంచి, ఈ అహంభావన అనే నిద్రలోనుంచి, వ్యక్తీభావన అనే నిద్రలోనుంచి, మనల్ని మేలుకొలిపే వరకూ గురువు మనల్ని వెంటాడుతూ ఉంటాడు. మనం చనిపోయాక మళ్లీ పునర్జన్మలోకి వెళ్తాము. ఏ జన్మలోకి వెళ్తామో మనకి తెలియదు. కానీ గురువు చూసుకుంటాడు. మళ్లీ ఆ జన్మలోకి వస్తాడు. గురువుని మీరెవరో నాకు తెలియదు అంటాము. ఆయనను మనము ప్రేమించము. కొత్త జన్మలో కూడా ఆయన మీద ప్రేమ కలిగేటట్లు చేసుకునే బాధ్యత కూడా గురువే తీసుకుంటాడు. "జన్మాంతర అనుబంధం ఉంటేనే కానీ నీకు స్నేహం నిలబడదు, ఆ ఆప్యాయత కూడా నిలబడదు" అంటాడు కాళిదాసు. జన్మాంతరంలో మనకి అనుబంధం ఉంటేనే జీవితం పొడుగునా ఆప్యాయత నిలబడుతుంది, ఆ స్నేహం నిలబడుతుంది, ఆ మాధుర్యం నిలబడుతుంది, దానిని కాపాడుకుంటాము.

లోపల ఎక్కడైతే ఆనందం ఉందో, ఎక్కడైతే శాంతి ఉందో, ఎక్కడైతే వెలుగు ఉందో, అక్కడికి తీసుకెళ్లటానికి, ఆ హృదయం యొక్క లోయలలోకి తీసుకెళ్లటం కోసం, మనసుని ఎలా తయారు చెయ్యాలి, ఎలా ముగ్గేయాలి అవన్నీ చూసుకుంటాడు. లోపల ఉన్న వస్తువు ఎంత నిర్మలంగా ఉందో, ఎంత నిశ్చలంగా ఉందో, ఎంత ఏకాగ్రంగా ఉందో, ఎంత సమానంగా ఉందో, మన మైండ్ ని కూడా అలా చేసి, తదాకారం చేసి అందులో కలిపేస్తాడు. వాడు గురువు. నీకు ఏదో ఉపకారం చేస్తున్నాడని నువ్వు అనుకోవాలని గురువు అనుకోడు. అలా అనుకుంటే వాడు గురువు కాదు. మిమ్మల్ని ఏదో ఉద్ధరిస్తున్నాను

అనుకునేవాడు ఎవడూ మీ గురువు కాదు. గురువు లోపల ఉంటాడు, బయటా ఉంటాడు. పైన ఉంటాడు, క్రింద ఉంటాడు. గురువు అంటే బ్రహ్మమే, ఆయన అంతటా ఉంటాడు. బయట ఉన్న గురువు మనసుని లోపలికి నెట్టుతాడు అంటే నీ మనస్సుకి లోచూపు కలగటం కోసం బయటి నుంచి బోధిస్తాడు. బోధించి అక్కడ ఆపుచేయడు. నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు. నిజమైన గురువే నీకు బయట ఊరికే కాళ్ళు చేతులు తొడుక్కొని వేషం వేసుకొని వచ్చాడు. తాను ఏ లోయల్లో ఉన్నాడో, ఎంత లోతులలో ఉన్నాడో అంత లోతులలోకి నువ్వు వెళ్లేవరకూ, ఆయన స్థితిని నువ్వు పొందేవరకూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు. బయట ఉన్న గురువు నిన్ను లోపలకు నెట్టుతాడు. లోపల ఉన్న గురువు నిన్ను లోపలకు గుంజుకొని ఆయనలో ఐక్యం చేసుకుంటాడు. ఇక్కడ గురువు అంటే భగవాన్ చెప్పేది కాలేజీలో హైస్కూలులో చెప్పే మాస్టారులు కాదు. తను దేని గురించి చెపుతున్నాడో, అది వాడు అయ్యి ఉండాలి, వాడు గురువు.

నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు. అయితే ఆయన రూపరహితుడు, నామరహితుడు, కర్మరహితుడు, జన్మరహితుడు. అన్నిటికీ రాహిత్యం. వాడిని నువ్వు అర్థం చేసుకోలేవు. దేహాభిమానం ఉన్న నువ్వు దేహాభిమానం లేని వాడిని ఎలా అర్థం చేసుకుంటావు. అది సాధ్యం కాదు. అందుచేత నీకోసం వాడికి అవసరం లేకపోయినా దేహం ధరించి వస్తాడు, వాడు గురువు.

ఎన్నో జన్మల నుండి గురువు వేరు, నేను వేరు అనుకొన్నాను. గురువు అంటే ఎక్కడో ఉన్నాడు అనుకొన్నాను. కానీ మీరు బయట లేరు, నా హృదయంలోనే ఉన్నారు అని ఈనాటికి తెలిసింది. ఆ అనుభవం మీరే కలుగచేశారు. మీ ఋణం తీర్చుకోవటానికి నన్ను ఏమి చేయమంటారు అని ఒక శిష్యుడు గురువుగారిని అడిగాడు. నువ్వు ఏ అనుభవమును అయితే పొందావో, ఏ స్థితిని అయితే పొందావో అలాగే ఉండిపోవటమే నా ఋణం తీర్చుకోవటం అన్నారు గురువుగారు. గురువు నీ హృదయములోనే ఉన్నాడు అనే అనుభవం నీకు కలిగింది. ఆ అనుభవము నుండి జారకుండా అది స్థిరము అయ్యేలాగా చూసుకో. ఆ స్థితిలో ఉండిపో. అలా ఉంటే నా ఋణం తీర్చుకొన్నట్లే అన్నారు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 19 ఏప్రియల్ 1996, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనకి బ్రహ్మానుభవం కలుగజేయటంలో ఏవిధంగా గురువు యొక్క అనుగ్రహం సహకరిస్తుంది అని ప్రశ్న. గురువు అంటే ఆత్మ, నీ శరీరం మరణిస్తుంది కాని మరణం లేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది, అదే గురువు. ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా, సత్యం అన్నా ఒక్కటే. ఇవన్నీ పేర్లు తేడా కానీ ఉన్న విషయం అంతా ఒక్కటే. మన హృదయంలో ఒక నిజం ఉంది. అది పారమార్థిక సత్యం, వ్యవహారిక సత్యం కాదు. ఆ పారమార్థిక సత్యమే లోపలఉన్న గురువు. మన మనస్సుని పవిత్రం చేసి, మనల్ని పరిశుద్ధుల్ని చేసి, ఆ వస్తువు తెలిసేటట్టు మనల్ని అనుగ్రహించడం కోసం, లోపల ఉన్నటువంటి ఆ సద్వస్తువే కాళ్ళు, చేతులు తొడుక్కుని బాహ్యంగా వస్తాడు, అంటే ఒక ఆకారం ధరించి వస్తాడు, వాడే గురువు. మనకి రూపదృష్టి ఉంది, నామదృష్టి ఉంది. కాని రూపదృష్టికి, నామదృష్టికి అతీతమైనది సద్వస్తువు.


గురువు ఎందుకు బాహ్యరూపం ధరించి వస్తాడు అంటే నిజమైన గురువు మన లోపల ఆత్మగానే ఉన్నాడు. ఆ నిజమైనటువంటి వస్తువుని మనకి తెలియజేయడం కోసం, మనకి బోధ చేసి, మనల్ని అనుగ్రహించి, బాహ్యాముఖంగా తిరుగుతున్న మనస్సుని అంతర్ముఖం చేసి, మనస్సులో ఉన్న దోషాలను తొలగించి, మనసుని పరిశుద్ధం చేసి, మన మనస్సుని అంతర్ముఖం చెయ్యడానికి బాహ్యమైన గురువు మనకి సహకరిస్తాడు. బాహ్యమైన గురువు మనల్ని ప్రేమిస్తాడు, అనుగ్రహిస్తాడు, కరుణిస్తాడు, ఆయన యందు విశ్వాసం కలిగేటట్టు, ఆయన యందు ప్రేమ కలిగేటట్టు, ఆయనే చేసుకుంటాడు.

అన్నీ తలంపులే, చావు కూడా ఒక తలంపే. పుట్టుక కూడా ఒక తలంపే కానీ గురువు అనుగ్రహం మటుకు తలంపు కాదు. మనకు గాఢనిద్రలో తలంపులు ఏమీ లేవు

కానీ మనం ఉన్నాం. అంటే సద్వస్తువు నీకు తలంపులు లేకపోయినా అది ఉంటుంది. అంటే నీ తలంపులు మీద అది ఆధారపడి లేదు. గురువు యొక్క అనుగ్రహం కానీ, ఈశ్వరుడు కానీ నీ తలంపులు మీద ఆధారపడి లేదు, అంటే తలంపులకి అతీతం. మనం ఇప్పుడు నేను నేను అని అంటున్నాం అంటే, మనలో ఉన్న మనస్సే ఇప్పుడు మనకి నేనుగా వ్యక్తం అవుతోంది. నేను అనే తలంపు, ఇతర తలంపులు అణిగిపోయిన గాఢనిద్ర స్థితిలో అంటే తలంపులు లేనప్పుడు కూడా హాయిగా ఉన్నాం. తలంపులు లేనప్పుడు మనం ఉండం అనుకోకూడదు. తలంపులు లేనప్పుడు నువ్వు ఉంటున్నావు. గాఢనిద్రలో నీకు ఏమి తలంపులు లేవు, కానీ నువ్వు లేకుండా పోలేదు. గాఢనిద్రలో నేను లేనని ఎవరూ చెప్పడానికి అవకాశం లేదు. ఎందుచేత అంటే అక్కడ తలంపులు లేవు కానీ నువ్వు ఉన్నావు. అక్కడ నీకు రాగద్వేషాలు లేవు, కానీ నువ్వు అక్కడ ఉన్నావు. అంటే ఈ రాగం, ద్వేషం, కామం, క్రోధం ఏ మనస్సు లోంచి అయితే పుడుతున్నాయో, ఆ మనస్సు గాఢనిద్రలో అణిగిపోయి ఉంటుంది. కామక్రోధాలకి ఉనికి అయినటువంటి మనస్సు అణిగిపోయినపుడు కామక్రోధాలు కూడా అణిగిపోతాయి.

స్వర్గలోకం, నరకలోకం, మరణానంతర జీవితం, ఇవన్నీ కూడా సత్యం కాదు అనుకోకండి, అన్నీ సత్యమే. అయితే మరణానంతరం ప్రయాణం చేసే ఈ జీవుడు ఎంత సత్యమో, ఆ లోకాలు కూడా అంతే సత్యం. ఈశ్వరుడు మనకి చెయ్యలేని ఉపకారం కూడా గురువు చేస్తాడు. ఎందుచేత అంటే ఈశ్వరుడు మన పుణ్యానికి ఫలితం ఇస్తాడు, మనం చేసిన పాపానికి ఫలితం ఇస్తాడు, అంటే మనం ఏ పని అయితే చేశామో దానికి ఫలితం ఇస్తాడు వాడు ఈశ్వరుడు. కానీ పాపపుణ్యాలకి కారణం అయినటువంటి మనస్సుని అణిచేసి సద్వస్తువు దగ్గరకి తీసుకుని వెళ్ళడానికి గురువు సహకరిస్తాడు. ఈశ్వరుడు చెయ్యలేని పని కూడా గురువు చేస్తాడు. నువ్వు చేసిన కర్మకి ఫలితాన్ని ఇస్తాడు ఈశ్వరుడు కానీ గురువు అలా కాదు. అంటే నిన్ను నీ మూలం లోకి తీసుకుని వెళ్ళడానికి ప్రయత్నం

చేస్తాడు. ఒక మాట మీరు జ్ఞాపకం ఉంచుకోండి, మనలో ఏదో ఒక్క వాసనే ఉంది అనుకోండి, ఆ ఒక్క వాసన వల్ల జన్మ వచ్చింది అనుకోండి, మళ్ళీ ఆ జన్మలో మనం కొత్త వాసనలు పోగు చేసుకొంటే, కొన్ని వేల జన్మలకి బీజాలు అక్కడ పడవచ్చు. ఒక జన్మకి కనుక హేతువు ఉంటే, ఆ జన్మని బట్టి ఇంకా కొన్ని వేల జన్మలు రావచ్చు. అంటే ఏ శరీరం ఉండగా వాడికున్న వాసనలు నిశ్శేషంగా, శేషం లేకుండా నశించాయో, అప్పుడే వాడు పునర్జన్మ లేని స్థితికి ఎదుగుతాడు కానీ ఒక్క పునర్జన్మ హేతువు ఉన్నప్పటికీ అది కొన్ని వేల పునర్జన్మలకి దారి తీయవచ్చు. అందుచేత ఇక్కడ మీరు బాగా గ్రహించవలసింది ఏమిటి అంటే, పునర్జన్మ హేతువులు అన్నీ నిశ్శేషంగా నశిస్తేనే కానీ మనం ఒడ్డుకి వచ్చాం అని చెప్పడానికి వీలు లేదు. అందుకే బహుజాగ్రత్తగా ఉండాలి మనం. జన్మను కోరుకునేవాడు, ఇతర లోకాలకి ప్రయాణం చేసేవాడు, భోగదృష్టి ఉన్నవాడు జీవుడే కాబట్టి ఆ జీవలక్షణాలు తొలగించి, జీవుడు పల్చబడేటట్టు చేసి, ఆ జీవుడు తన మూలంలోకి వెళ్ళి కరిగిపోయేలా చేసేవాడు గురువు మాత్రమే. బాహ్యంగా గురువు ఉన్నాడు, లోపల ఆత్మ రూపంలో ఉన్నాడు, బాహ్యంగా ఉన్న గురువు ఏమి చేస్తాడు అంటే నీ మనస్సుని ఏవిధంగా పవిత్రంచెయ్యాలో చూస్తూ ఉంటాడు. కానీ మీరు కంగారు పడకూడదు, ఆ మనస్సు అనేది ఒక్కసారే పవిత్రం అవ్వదు. ఎప్పుడు ఏవిధంగా నీ మనస్సుని సరైన కండిషన్‌లో పెట్టాలో, వాసనని ఎప్పుడైతే తొలగించటానికి అవకాశం ఉందో, అలా స్లోగా, స్టడీగా



**నిప్పు దగ్గర కూర్చున్నప్పుడు వేడి ఎలా తెలుస్తుందో, అలా గురువు సమక్షంలో నీ తలంపులతోటి, ఆలోచనలతోటి సంబంధం లేకుండా ఆయన అనుగ్రహం వలన హృదయంలో ఉన్న సత్యం అతి సహజంగా నీకు ఎరుకలోకి వస్తుంది. అది గురువు యొక్క వైభవం.**

చేసుకుని వస్తాడు, ఆ వాసనని ఎప్పుడు eliminate చెయ్యాలో చూసుకుంటూ ఉంటాడు, గురువు నీ కూడానే ఉంటాడు. దేహాలు మారినా, పరిసరాలు మారినా, గృహాలు మారినా, కుటుంబాలు మారినా, గురువు మటుకు జన్మ జన్మలకి నీ కూడా వస్తూ, నువ్వు బ్రాహ్మీస్థితి పొందేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. ఒకేసారి నీకు జ్ఞానం ఇవ్వలేక కాదు గురువు, నీ మైండ్‌ని స్లోగా పవిత్రం చేసుకుంటూ వస్తాడు, ప్రతీజన్మలో కూడా నీ కూడానే ఉంటాడు. మనస్సు పవిత్రం అయిన వెంటనే దానిని దాని మూలంలోకి లాగుతాడు. బయట ఉన్న గురువు మనసుని లోపలకి నెట్టుతాడు, లోపల ఉన్న గురువు మనసుని లోపలకి గుంజుకొని తన స్వరూపాన్ని ఇస్తాడు, వాడు గురువు.

భగవాన్ ఏమని చెప్పారు అంటే ఈ శ్రవణాలు, ఈ మననాలు, ఈ ధ్యానాలు, ఈ జపాలు, ఈ మునగటాలు, తరువాత పూజలు ఇవన్నీ కూడా రెండో పక్షమే. గురువు అనుగ్రహమే అత్యంత బలీయమైనది. గురువు ఏమి చేస్తాడు అంటే ఒకొక్కసారి నీ కోరికలు కూడా నెరవేరుస్తూ ఉంటాడు. అంటే అక్కడ కోరిక నెరవేర్చడం ముఖ్యం కాదు, ఆయన మీద నీకు ప్రేమ కలుగజేయడం కోసం, నీ మనస్సుకి ఆయన మీద ఒక సజీవమైన విశ్వాసం కలుగజేయడం కోసం, అవసరం అయితే నీ కోరికలని కూడా నెరవేరుస్తూ ఉంటాడు గురువు. ఇది బాగా అర్థం చేసుకోండి, గురువు మీద మనకి ప్రేమ కలుగుతోంది అంటే ఆయన మనలని ప్రేమిస్తున్నాడు కాబట్టి ఆయన మీద మనకి ప్రేమ కలుగుతుంది కానీ, మన తెలివితేటల వల్ల కానీ, లేకపోతే ఈ సంకుచితమైనటువంటి మనస్సు తోటి మనం గురువుని ప్రేమించలేము.

గురువు ఏమి చేస్తాడు అంటే మానవరూపం ధరించి వచ్చి ఏ సత్యాన్ని నువ్వు తెలుసుకుంటే జనన, మరణ ప్రవహంలోంచి బయటకి వస్తావో, ఆ పారమార్థికసత్యం గురించి నీకు బోధించడానికి ఉపక్రమిస్తాడు. గురువు బోధ వినడం వలన నీ మనస్సు పవిత్రం అవుతుంది, బ్రహ్మానుభవం పొందడానికి తగినటువంటి శక్తిని సంపాదిస్తుంది.

ఏ వాసనలు అయితే ఈ భౌతికమైన జీవితానికి, ఈ ప్రాపంచికమైన జీవితానికి మనలని అంటిపెట్టుకుని ఉండేటట్టు చేస్తున్నాయో, ఈ వాసనలు అనే సంకెళ్ళని టైము చూసుకుని తొలగించటానికి గురువు చూస్తూ ఉంటాడు, నిన్ను కరుణిస్తూ ఉంటాడు, నిన్ను ప్రేమిస్తూ ఉంటాడు, నీ కోరికలు నెరవేరుస్తూ ఉంటాడు, నిన్ను అనుగ్రహిస్తూ ఉంటాడు, ఆయన యందు నీకు నమ్మకం కలిగేలా ప్రవర్తిస్తూ ఉంటాడు, ఆయన యందు నీకు విశ్వాసం కలిగాక బోధించడం ప్రారంభిస్తాడు ultimate truth గురించి, ఆ పారమార్థిక స్థితి గురించి నీకు బోధిస్తాడు, బోధించి వదిలేయడం కాదు, ఆయన బోధించే బోధ నీకు అనుభవంలోకి రావడానికి ఏ సంస్కారాలు అయితే నీకు అడ్డువస్తున్నాయో, ఆ సంస్కారాలు తొలగించే బాధ్యత కూడా గురువే తీసుకుంటాడు, వాడు గురువు. ఏ వస్తువును నువ్వు తెలుసుకోవడానికి గురువు బోధిస్తున్నాడో, ఆ వస్తువు మీకు అనుభవంలోకి వచ్చేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు. మీరు ఈ శరీరం విడిచిపెట్టేసి కొత్త శరీరంలోకి వెళ్ళినప్పటికీ మీరు ఏ దేహంలో ఉన్నారో గురువు చూసుకుంటూ ఉంటాడు. అక్కడకి వచ్చి మీరు పూర్వజన్మలో ఎంతవరకు సాధన చేశారో, మళ్ళీ అక్కడ నుంచి మీ చెయ్యి పట్టుకుని మీ చేత సాధన చేయిస్తూనే ఉంటాడు. గురువు యొక్క అనుగ్రహం మీకు కనిపించక పోవచ్చు. అంటే కనిపించని సంకెళ్ళు వంటివి. కనిపించని సంకెళ్ళు తోటి మన మనసుని కట్టేసుకుని మనసులో ఉన్న కల్మషం అంతా పిండి, ఆ మనస్సుని సూక్ష్మం చేసి, దానిని హృదయంలో నిలబెట్టి అది హృదయంలో పూర్తిగా కరిగిపోయే వరకు కూడా గురువు బాధ్యత తీసుకుంటాడు. అది గురువు అనుగ్రహం అంటే! ఏ విషయాల మీదకి అయితే నీ మనస్సు ఎక్కువగా వెళ్లి వాలుతోందో, ఆ విషయాల లోంచి నీ మనస్సుని విడదీస్తాడు.

శంకరాచార్యుల వారు ఈ మనసు అసత్యం, ఈ ప్రపంచం అసత్యం, ఈ ప్రపంచం మిథ్య అని ఎందుకు చెప్పారు అంటే, ఈ ప్రపంచం అసత్యం అనుకుంటేనే కానీ నీ మనస్సు అంతర్ముఖం కాదు. ఈ ప్రపంచం నిజం అనుకుంటావు అనుకో ఏదో ఒక రూపంలో నీ

మనస్సు బయటకి వచ్చేస్తుంది. అందుచేత ఏ జ్ఞాని చెప్పినా, ఏ యోగి చెప్పినా, వాడు నీ మనస్సుని అంతర్ముఖం చెయ్యడానికే చూస్తారు. నీ మనస్సుని ఎవడైతే అంతర్ముఖ పరుస్తున్నాడో వాడే గురువు. నీ మనస్సుని అంతర్ముఖ పరచలేనివాడు గురువు కాదు రాక్షసుడు అన్నారు భగవాన్. ఒక అలవాటుని మనం సంతృప్తి పరచేకొలది అలవాటు పెరుగుతుంది. కానీ అలవాటుని కనుక కంట్రోల్ చేసుకుంటే అది కరిగిపోతుంది. మీ అలవాట్ల వల్లే, ఇంద్రియ విషయాల వల్లే మీ మనస్సు బాహ్యాముఖం అవుతుంది. అందుచేత అలవాట్లలోంచి, వాసనలలోంచి, ఆ సంస్కారాలలోంచి విడుదల చేస్తేనే కానీ నీ మనస్సు సూక్ష్మం కాదు. నీ మనస్సుని సూక్ష్మం చేస్తేనే కానీ అది అంతర్ముఖం కాదు. బుద్ధిసూక్ష్మత ఉన్నవాడు కానీ సత్యాన్వేషణ చెయ్యలేడు. అసలు సత్యాన్ని అన్వేషించడానికి సూక్ష్మబుద్ధి ఉండాలి. ఆ సూక్ష్మబుద్ధిని గురువే నీకు కలుగజేస్తాడు. గురువు దేహంలో ఉన్నప్పటికీ ఆ దేహం వాడిని బంధించదు. ఎందుచేత అంటే తాను దేహమాత్రుడిని కాదు అన్న సంగతి గురువుకి తెలుస్తూ ఉంటుంది. అంటే వాడు ఆ దేహంలో ఎందుకు ఉన్నాడు అంటే మనకున్న దేహబుద్ధిని పోగొట్టడం కోసం, బాహ్యంగా మనకి సహాయం అందజేయడం కోసం, ఒక రూపం ధరించి వచ్చాడు కానీ ఆ రూపం తాను కాదన్న సంగతి తనకి తెలుస్తూనే ఉంటుంది.

మీ మనస్సు ఎంత ఆందోళనగా ఉన్నా, మీ మనస్సు ఎంత అశాంతిగా ఉన్నా, మీ మనస్సు ఎంత చిరాకుగా ఉన్నప్పటికీ వాటి నుంచి మీ మనస్సుని విడదీసి శాంతి కలుగజేస్తాడు గురువు. అంటే మీకు ఎప్పుడైనా శాంతి కలుగుతోంది అంటే అది మీ తెలివితేటలు అనుకోకండి అది గురువు అనుగ్రహం వల్ల కలుగుతుంది. చివరి రోజులలో ఒక భక్తుడు భగవాన్‌తో మీరు వెళ్ళిపోతున్నారు, మేము ఉండిపోతున్నాము. ఇంక మమ్మల్ని ఎవరు చూస్తారు అని అడిగితే భగవాన్ "ఈ శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని ఈ శరీరం ప్రేమించడం లేదు, ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో అది శరీరం మరణించిన తరువాత

కూడా మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటుంది" అన్నారు. మీకున్న శాంతి సహజం అయ్యేవరకు, ఆ permanent happiness మీకు కలిగేవరకు మిమ్మల్ని లోపలఉన్న గురువు కానీ, బయట ఉన్న గురువు కానీ విడిచిపెట్టరు, వాళ్ళు చేసే పని వాళ్ళు చేస్తూనే ఉంటారు, అది గురువు అనుగ్రహం. అంటే ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటంటే మనకి వాసనలు తోటి ఉన్న సాంగత్యం, అహంభావన తోటి ఉన్న సాంగత్యాన్ని ఊడగొట్టడానికి బయటఉన్న గురువు ప్రయత్నం చేస్తాడు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీకు డబ్బు ఉండవచ్చు కానీ డబ్బు నీది అనుకుంటున్నావు అందుచేత నువ్వు అపవిత్రుడివి అవుతున్నావు. ఇది బాగా అర్థం చేసుకోండి. కొంతమందికి పెద్ద పెద్ద చదువులు ఉంటాయి. ఆ చదువు వాడు కాదు, కానీ చదువుతో తాదాత్మ్యం పొందుతున్నాడు. అందుచేత వాడు అపవిత్రుడు అవుతున్నాడు. రోజూ కాళ్ళు బాడి చేసుకోవడం, మళ్ళీ కడుక్కోవడం ఇంక ఇదే పనా? మీరు కానివాటితోటి తాదాత్మ్యం పొందడం వల్లే అపవిత్రులు అవుతున్నారు. మళ్ళీ అపవిత్రం నుంచి బయట పడడం కోసం ఈ పూజలు, జపాలు, ధ్యానాలు మొదలు పెడుతున్నారు.

కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు? అర్జునా నువ్వు ఆత్మవే అని చెప్పాడు కానీ చదువు నువ్వు, డబ్బు నువ్వు, అధికారం నువ్వు, శరీరం నువ్వు ఇలా చెప్పాడా? ఇవే నిజం అయితే చెప్పి ఉండేవాడు కదా, ఇది బాగా అర్థం చేసుకోండి, చదువే మీరు అనుకోండి మీరు చదువే మీరు ఆత్మ కాదు అని భగవంతుడు చెప్పేవాడు కదా, భగవంతుడికి అబద్ధం

**మనకు చైతన్యం అనుభవంలోనికి రాకుండా ఏ అజ్ఞానమైతే అడ్డు వస్తోందో దానిని తొలగించుకోవడానికి సహకరించేవాడే గురువు.**



చెప్పవలసిన పని ఏముంది? ఇప్పుడు మామూలుగా స్వార్థం ఉన్న వాళ్ళకి అసత్యం చెప్పవలసిన పని ఉంటుంది. దేవుడికి అసత్యం చెప్పవలసిన పని ఏమిటి? నిజంగా మీరు డబ్బే అనుకోండి నువ్వు డబ్బే అని చెబుతాడు. లేకపోతే మీరు చదువు అనుకోండి, నువ్వు చదువే అని చెబుతాడు. మీకు అర్థం అవుతోందా? నీ హృదయంలో నేను ఆత్మగా ఉన్నాను, అది నువ్వని చెప్పాడు. ఈ డబ్బు, చదువు, గౌరవాలు, అధికారాలు అన్నీ కూడా దేహం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. వాటి తోటి నువ్వు తాదాత్మ్యం చెందడం వల్ల నువ్వు అపవిత్రుడవు అవుతున్నావు అది ఇక్కడ భగవాన్ చెప్పేది. ఇటువంటి విషయాలు బోధించడానికే గురువు శరీరంగా ఒక రూపం ధరించి వస్తాడు. నీ చదువు తోటి కానీ, గౌరవం తోటి కానీ, అధికారం తోటి కానీ, నువ్వు తాదాత్మ్యం చెందడానికి నీ దేహబుద్ధి కారణం. దేహబుద్ధి కనుక నశిస్తే వీటితో నువ్వు తాదాత్మ్యం పొందవు. దేహబుద్ధి నశించిన వెంటనే నువ్వు నశిస్తావు అనుకోకు, దేహబుద్ధి నశించిన వెంటనే నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. ఆత్మ అంతటా ఉంది, నీకు ఆత్మబుద్ధి కలిగిన వెంటనే అంతటా ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తుంది. ఆత్మకి చావు లేదు, నీకు ఆత్మబుద్ధి కలిగిన వెంటనే చావు లేదన్న సంగతి నీకు తెలుస్తుంది. ఆత్మలో ఉన్నది శాంతే, ఆత్మలో ఉన్నది ఆనందం, అది నీ స్వరూపంగా వ్యక్తం అవుతుంది. వైకుంఠంలో ఏ సుఖం అయితే నువ్వు ఉంది అనుకుంటున్నావో ఆ సుఖం నీకు స్వరూపంగా వ్యక్తం అవుతుంది. అది కడసారిస్థితి, అది ఫైనల్ స్టేట్.

భగవాన్ చెప్పేది ఏమిటంటే ఆలోచన నేర్చుకోమంటున్నారు. ఆలోచన అమృతం తోటి సమానం అంటున్నారు. సమాజంలో మనలని ఉద్రేకపరచేవాళ్ళు చాలామంది ఉన్నారు, మీ అనుభవంలో మీకే తెలుస్తుంది. కానీ మనచేత ఆలోచింపచేసేవాళ్ళు మటుకు బహు తక్కువ మంది ఉంటారు, వాళ్ళే మనకి హితులు. మానవులు అనేక రకాలైన ఆధ్యాత్మిక సాధనలు చేస్తున్నారు. దీని యొక్క చివరిస్థితి ఏమిటి అంటే నీ స్వరూపం నువ్వు తెలుసుకోవటమే. నీ స్వరూపంలో ఏముంది? సుఖం ఉంది. ఎప్పుడైతే నీకు స్వరూపం

తెలిసిందో సుఖం కూడా నీకు స్వరూపంగా వ్యక్తం అవుతుంది. అది ఆధ్యాత్మిక సాధన యొక్క చివరి భాగం. ఆత్మానుభవంపొందడం కోసం పెళ్ళిళ్ళు చేసుకోకుండా ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయి తపస్సులు చేసి అనేకమంది దీని గురించి త్యాగాలు చేస్తున్నారు. కొంతమంది బాహ్యమైన ఇంద్రియసుఖాలు కూడా విడిచి పెట్టి, అనేక త్యాగాలు చేసి వస్తువును పొందడం కోసం వాళ్ళకున్న comfortsని కూడా విడిచిపెట్టి తపస్సులు చేస్తున్నారు. సన్యాసులు కంటే, గృహస్థులే ఎక్కువ కదా, ఈ గృహస్థులు అంటే వివాహం ఎవరైతే చేసుకున్నారో వాళ్ళు కూడా ఈ ఆత్మానుభవం, బ్రహ్మానుభవం పొందవచ్చా అని భగవాన్‌ని ప్రశ్నిస్తున్నారు. అప్పుడు భగవాన్ అంటున్నారు తప్పనిసరిగా గృహస్థులు కూడా, అంటే వివాహం చేసుకున్న వాళు ్ళ కూడా ఈ బ్రహ్మానుభవం పొందవచ్చు. అందులో ఏమి సందేహం లేదు, అంటే గృహస్థులు కూడా బ్రహ్మానుభవం పొందడానికి అర్హులే, వాళ్లకి కూడా యోగ్యత ఉంది.

సన్యాసి అనేది ఒక తలంపు. సన్యాసి ఏమనుకుంటాడు అంటే నేను సన్యాసిని, నేను సన్యాసిని అనుకుంటాడు, గృహస్థుడు ఏమనుకుంటాడు అంటే నేను గృహస్థుడని, నేను గృహస్థుడని అనుకుంటాడు. అదీ తలంపే, ఇదీ తలంపే. వాడికీ బ్రహ్మానుభవం ఉండదు, వీడికీ బ్రహ్మానుభవం ఉండదు. నేను తెల్ల బట్టలు కట్టుకున్నాను అని వీడు అనుకుంటాడు, ఎర్ర బట్టలు కట్టుకున్నాను అని వాడు అనుకుంటాడు కానీ వాడు బట్టలకే పరిమితం, వీడు బట్టలకే పరిమితం. మీకు అర్థం అవుతోందా? అంటే ఏమిటి, వాడూ నేను సన్యాసిని అనుకోవడం ఒక తలంపు, వీడూ నేను గృహస్థుడని అనుకోవడం ఒక తలంపు, వాడికీ నిజం తెలియదు, వీడికీ నిజం తెలియదు అందుచేత భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే, గృహస్థాశ్రమంలో ఉన్నవాళ్ళు కూడా బ్రహ్మానుభవం పొందవచ్చు ఏమీ అనుమానం లేదు, ఏమీ సందేహించవలసిన అవసరం లేదు. మీరు వివాహం చేసుకోవచ్చు, మీరు వివాహం చేసుకోకపోవచ్చు, నువ్వు చేసుకున్నావా? చేసుకోలేదా? అన్నది ముఖ్యం కాదు. నువ్వు ఎంతవరకు పవిత్రుడవు? ఎంతవరకు నీకు యోగ్యత ఉంది? ఎంతవరకు నువ్వు ఫిట్ అయ్యావు అన్నది ముఖ్యం కానీ,

భగవంతుడు నువ్వు ఎర్ర బట్టలు కట్టుకున్నావా? నువ్వు తెల్ల బట్టలు కట్టుకున్నావా? నువ్వు సన్యాసం తీసుకున్నావా? లేకపోతే నువ్వు గృహస్థాశ్రమంలో ఉన్నావా? అది చూడదు, బ్రహ్మం ఎప్పుడో లేదు, ఎక్కడో లేదు, బ్రహ్మమే అంతటా ఉంది, ఇక్కడా ఉంది, అక్కడా ఉంది, అంతటా ఉంది, అది లేని స్థలం అంటూ లేదు. దానికి coming లేదు, going లేదు. అంతటా ఉన్న వస్తువుని తెలుసుకోవడానికి, పెళ్లి చేసుకోవడానికి, పెళ్లి చేసుకోకపోవడానికి సంబంధం ఏమిటి అయ్యా? ఆ వస్తువు నువ్వు పెళ్లి చేసుకున్నావా లేదా అని చూడదు. అంటే నీకు యోగ్యత ఉందో, లేదో చూస్తుంది. ఆ truth రివీల్ అవ్వడానికి తగిన strength నీకు ఉందో, లేదో చూస్తుంది. నువ్వు ఫిట్ అయ్యి ఉంటే అది వెంటనే రివీల్ అయిపోతుంది. ఈ క్షణంలో ఆ వస్తువు నీకు వ్యక్తం అవుతుంది. అంతే కాని నువ్వు పెళ్లి చేసుకున్నావా, పెళ్లి చేసుకోలేదా, నువ్వు ఎర్రబట్టలు కట్టుకున్నావా, నువ్వు తెల్లబట్టలు కట్టుకున్నావా, లేకపోతే మీరు రాజులా, మీరు బ్రాహ్మణులా, లేకపోతే మీరు వైశ్యులా, మీరు హిందువులా, మీరు మహమ్మదీయులా, మీరు ఇండియన్సా? మీరు అమెరికన్సా? మీరు ఏ జాతి వారు? మీ కలర్ తోటి కానీ, మీ నేషన్ తోటి కానీ, మీ ఎడ్యుకేషన్ తోటి కానీ, మీ వెల్త్ తోటి కానీ దానికి ఏమి సంబంధం లేదు. అది నీకు రివీల్ అవ్వడానికి తగిన యోగ్యత నీకు ఉంటే అది వెంటనే రివీల్ అయిపోతుంది.

రమణమహర్షిగారికి పదహారో సంవత్సరంలో బ్రహ్మానుభవం కలిగింది. ఆయన వయసు తోటి నిమిత్తం లేదు. అంటే నీకు అర్హత ఉందో, లేదో చూస్తుంది కానీ నీ వయసు చూడదు, నీ నేషన్ చూడదు, నీ caste చూడదు. ఎంతవరకు నువ్వు deserve అయ్యావో చూస్తుంది అంతే. మానసికంగా నువ్వు పక్వానికి వచ్చావో, లేదో, నీకు maturity వచ్చిందో, లేదో చూసి వెంటనే రివీల్ అయ్యిపోతుంది. అది ఎక్కడ నుంచో రావక్కర్లేదు ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. ఎప్పుడో పొందుదాం అనుకుంటున్నావు, ఇప్పుడు లేదు అనుకుంటున్నావు నువ్వు, అసలు బ్రహ్మానుభవం ఇప్పుడు లేదు, ఇక్కడ లేదు అనే తలంపే

నీ realizationకి అడ్డుగా వస్తుంది. ఎంత అద్భుతమైన టీచింగ్ చూడండి. బ్రహ్మం అనేది ఇప్పుడు లేదు, ఇక్కడ లేదు, ఎప్పుడో దేహం చనిపోయిన తరువాత తెలుసుకునే వస్తువు అని నువ్వు అనుకుంటున్నావు అనుకో, బ్రహ్మానుభవం రాకుండా నీ తలంపే అడ్డు వచ్చేస్తుంది. బ్రాహ్మీస్థితి పొందడం కోసం నీ దేహం మరణించే వరకు ఆగక్కర్లేదు. అది ఇప్పుడే పొందవచ్చు, ఇక్కడే పొందవచ్చు, ఎందుచేత అంటే ఆ వస్తువు ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. అది నీకు రివీల్ అవ్వడానికి సిద్ధంగా ఉంది. ఆ వస్తువును ఎప్పుడు తెలుసుకుందామా, ఎప్పుడు సుఖపడదామా, ఎప్పుడు శాంతి సామ్రాజ్యానికి అధిపతి అవుదామా అని నువ్వు ఏవిధంగా అయితే తంటాలు పడుతున్నావో, వీళ్ళకి ఎప్పుడు మనం ఎరుక పడుదామా అని ఆ వస్తువు కూడా నీకు ఎరుక పడడానికి సిద్ధంగానే ఉంది. ఆ వస్తువు కోసం ఏ విధంగా అయితే నువ్వు ఎదురుచుస్తున్నావో, అది కూడా అంతే intensity తోటి, నీకు తెలియబడడానికి, నీకు ఎరుకబడడానికి సిద్ధంగానే ఉంది.

ఆ వస్తువు ఇక్కడ లేదనుకో, ఇప్పుడు లేదనుకో, అది ఎక్కడో వైకుంఠంలోనే కానీ ఇక్కడ లేదనుకో, ఒకచోట ఉండి మరొక చోట లేని వస్తువు అనుకో, ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేని వస్తువు అనుకో, నువ్వు సాధన చేసి అటువంటి వస్తువును తెలుసుకోవల్సిన అవసరం లేదు. అంతటా ఉన్న వస్తువును నువ్వు తెలుసుకుంటే, అన్ని కాలాల్లోను ఉన్న



**పంచదార తియ్యగా ఉంటుందా, చేదుగా ఉంటుందా అని జన్మల తరబడి చర్చ అనవసరం. పంచదార నోట్లో పోసుకుని చూసుకో నీకే తెలుస్తుంది. అలాగే గురువు అనుగ్రహం నీ కళ్ళకి కనబడకపోయినా, నీ చెవులకు వినబడకపోయినా అది నీ అనుభవానికి అందుతుంది.**

వస్తువును నువ్వు తెలుసుకుంటే సుఖపడతావు కానీ ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేని వస్తువుని, ఒక కాలంలో ఉండి మరొక కాలంలో లేని వస్తువుని నువ్వు తెలుసుకున్నా సుఖపడవు. అటువంటి వస్తువుని తెలుసుకోవాల్సిన అవసరం నీకు లేదు. సాధన చేసి అటువంటి చిల్లర విషయాలు తెలుసుకోవాల్సిన పని లేదు. ఏదైతే permanentగా ఉంటుందో దానిని తెలుసుకుంటే నీకు ప్రయోజనం ఉంది కానీ, ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు పోయే వస్తువుని తెలుసుకున్నా దానివల్ల నీకు ప్రయోజనం లేదు. నీ తలంపులు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం.

మీరు నార్మల్‌గా ఉండండి, naturalగా ఉండండి, కృత్రిమంగా ఉండవద్దు, జీవితంలో నటించవద్దు, సజీవమైన సత్యం సహజంగానే ఉంది, అసహజంగా లేదు. నువ్వు అసహజంగా ఉంటే సహజమైన వస్తువు నీకు తెలియదు. దానికి కృత్రిమం లేదు అందుచేత నువ్వు కృత్రిమంగా ఉంటే ఆ వస్తువు నీకు తెలియదు. ఆ వస్తువుకి కపటం లేదు, అందుచేత నువ్వు కపటంగా ఉంటే ఆ వస్తువు నీకు తెలియదు. ఆసక్తి లేకుండా పని చేస్తే ఏ పని నిన్ను బంధించదు, ఆసక్తి తోటి పనిచేస్తే మటుకు పని బంధిస్తుంది. ఇక్కడ నమస్కారాల గురించి చెబుతున్నారు భగవాన్, మీరు పాదనమస్కారాలు అవి చెయ్యక్కర్లేదు. ఇక్కడ భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే మీ పని మీరు జాగ్రత్తగా చేసుకోవడమే దేవుడికి పెట్టె నిజమైన నమస్కారం. God cannot be deceived by physical exercise. ఈ దండాల వల్ల మోసపోయేటంత అమాయకుడు కాదు దేవుడు, మీ పని ఏదో మీరు జాగ్రత్తగా చేసుకోవడమే దేవుడికి పెట్టె నిజమైన నమస్కారం. మీ పని మీరు శ్రద్ధగా చేస్తే మీ పని మీరు ప్రీతిగా చేస్తే, మీ ఇంట్లో బాగా వయసు వచ్చిన వాళ్ళు ఉన్నారు అనుకోండి, బాగా ముసలివాళ్ళు ఉన్నారు అనుకోండి, వాళ్ళు అశక్తులు అనుకోండి, వాళ్లకి సేవ చేస్తూ ఉంటే, వాళ్ళు మీ పట్ల ఎలా ఉన్నప్పటికీ, దేవుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. మీ ఇంట్లో మంచం మీద నుంచి కదలలేని వాళ్ళు ఉన్నారు అనుకోండి, మీరు వాళ్లకి సేవ చేస్తున్నారు అనుకోండి,

వాళ్ళు మీ పట్ల సదభిప్రాయం తోటి లేకపోయినా, మీరు సహృదయం తోటి సేవ చేస్తున్నారు కాబట్టి దేవుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. అంటే భగవాన్ చెప్పేది work done in true spirit is meditation. అది కూడా ధ్యానం తోటి సమానమే. మీరు ఆసక్తి లేకుండా ప్రేమ పూరితంగా కనుక పనిచేస్తుంటే, అది కూడా ధ్యానమే. ధ్యానం చెయ్యడం వలన ఏ ఫలితం వస్తుందో, ఆసక్తి లేకుండా పని చేయడం వలన కూడా మీకు అదే ఫలితం ఈశ్వరుడు ప్రసాదిస్తాడు. నిజమైన నమస్కారం ఏమిటి అంటే ఎవరు ఏ పని అయితే చేసుకుంటున్నారో, ఆ పనిని శ్రద్ధగా, ప్రీతిగా, ప్రేమగా చేస్తుంటే అదే దేవుడికి పెట్టె నిజమైన నమస్కారం. పని దొంగలుగా ఉండకూడదు, పని ద్వారా మీరు దేవుడిని పూజించండి. మీ పూజలు అన్నీ కూడా ఊరికే చేతులకి, పెదాలకే సరిపెట్టేస్తున్నారు. అంటే స్తోత్రాలకే సరిపెట్టేస్తున్నారు, పని చేయడం ద్వారా కూడా దేవుడి అనుగ్రహానికి మీరు పాత్రులు అవుతారు.

ఒక భక్తుడు భగవాన్‌ను "ఏమండీ ఇల్లు విడిచి పెట్టి వెళ్లి సాధన చేసుకుందాం అనుకుంటున్నాను, చేసుకోమంటారా" అని అడిగితే "నువ్వు ఇల్లు విడిచి పెట్టక్కర్లేదు, టైముకి కాఫీ తాగి, టైముకి భోజనం చేసి సాధన చేసుకో, ఇంటివద్ద సాధన చేసుకోవచ్చు. టైముకి భోజనం చేసి నువ్వు సాధన చేసుకోలేనప్పుడు, భోజనం దొరకని చోటుకి వెళ్లి నువ్వు సాధన ఏమిచెయ్యగలవు? నువ్వు ఇంటివద్ద ఉండి నీ పని ఏదో నువ్వు జాగ్రత్తగా చూసుకుంటూ సాధన చెయ్యవచ్చు, అంటే నువ్వు ఇల్లు విడిచి పెట్టి పారిపోవక్కర్లేదు" అని భగవాన్ చెప్పారు. వాడు "మీరు మటుకు ఇంటి నుండి పారిపోయి రావచ్చు, మేము మటుకు ఇంటివద్ద పడి ఉండాలా" అన్నాడు. అప్పుడు "నువ్వు నన్ను సలహా అడుగుతున్నావు కాబట్టి నేను నీకు చెబుతున్నాను. నేను ఇల్లు విడిచిపెట్టి అరుణాచలం వచ్చేసే ముందు ఎలా వచ్చానో చెప్పమంటావా, ఒక మహా ప్రవాహంలో గడ్డిపరక ఎంత తేలికగా కొట్టుకుని పోతుందో అంత తేలికగా వచ్చి ఇక్కడ పడ్డాను. ఇరుగుపొరుగు వాళ్ళని అడుగుదామా, స్నేహితుల సలహా అడుగుదామా, లేకపోతే గురువుల సలహా అడుగుదామా, లేకపోతే

బంధువుల సలహా అడుగుదామా అని నెలల తరబడి ఆలోచించి నేను అరుణాచలం రాలేదు. అరుణాచలేశ్వరుడు పిలిచాడు, వచ్చాను, అది నా దేహ ప్రారబ్ధం. నువ్వు అడుగుతున్నావు కాబట్టి నీకు సలహా చెబుతున్నాను కానీ నీకు లాగ అందరిని సలహా అడిగి మటుకు నేను అరుణాచలం రాలేదు" అన్నారు భగవాన్. అరుణాచలేశ్వరుడు పిలిస్తే వెళ్ళాడు ఆయన, అందరినీ సలహాలు అడిగి, మెంటల్‌గా ప్రిపేర్ అయ్యి వెళ్ళలేదు అది Automatic divine action. మనం ఏదైనా ప్రయాణానికి వెళ్ళాలి అంటే వారం రోజులు ముందే సర్దుకుంటాం. వెళ్ళేది నరసాపురమే కానీ సర్దుకోవటం మటుకు వారం రోజులు ముందే సర్దుకోవడం. భగవాన్ అలా సర్దుకుని వెళ్ళలేదు. శంకరాచార్యుల వారు సన్యాసం పుచ్చుకోవడానికి ఆచార్యుల వారి తల్లి అనుమతి ఇచ్చింది. అనుమతి ఇచ్చాక ఆయన ఇంటికి రాకుండా గృహత్యాగం చేసి వెళ్ళిపోయాడు, అంటే ఇంటికొచ్చి కాళ్ళు, చేతులు కడుక్కుని, బట్టలు పుచ్చుక్కుని, ఆలోచించి ఇంటి నుండి వెళ్ళలేదు ఆయన, ఇంటికి రాకుండా, రేపటి రోజు ఎలా ఉంటుందో తెలియకుండా వెళ్ళిపోయాడు అది వైరాగ్యం అంటే. ఈయన ఇంటి నుండి వెళ్ళిపోతాను అంటున్నాడు, భగవాన్‌ని అడగడం ఎందుకు వెళ్ళిపోవచ్చును కదా, ఒకవేళ భగవాన్ వెళ్ళమని చెప్పినా వీడు వెళ్లడు.

ఏసుక్రీస్తు ఏమన్నాడు అంటే, సూది బెజ్జంలోంచి ఒంటెను బయటకి లాగవచ్చును కానీ, ధనవంతుడిని స్వర్గలోకంలోకి పంపలేము అన్నాడు. ఎందుకు అన్నాడో చెప్పమంటారా, ఊరికే కాలక్షేపానికి అనలేదు ఆ మాట, ఒక భక్తుడు ఏసుక్రీస్తుతో "మీ కూడా వచ్చేస్తాను, మీ బోధలు అన్నీ నేను వింటాను, మీ బోధలు ఇతరులకి కూడా చెబుతాను, మీరు ఎక్కడ ఉంటారో అక్కడ ఉంటాను" అని చెప్పాడు. ఆయన "నీ పని ఏదో నువ్వు చేసుకుంటూ, నీ ఆధ్యాత్మిక సాధన నువ్వు చేసుకో, ఇంటివద్ద ఉండి చేసుకోవచ్చు, నా కూడా రావక్కర్లేదు" అని చెప్పాడు. అప్పుడు వాడు "అలా కాదండి మీ కూడా వచ్చేయడానికి నేను నిర్ణయించుకున్నాను" అన్నాడు. అప్పుడు ఏసుక్రీస్తు "నీకు బ్యాంకులో ఎంత డబ్బుందో,

నీకు పొలం ఎంత ఉందో, నీ ఇల్లు, నీ పొలం, నీ బ్యాంకు డబ్బు, ఊర్లో ఉన్న పేద ప్రజలకి పంచేసి అప్పుడు నా దగ్గరకి రా" అన్నాడు. మళ్ళీ వాడు కనిపించకుండా, అడ్రస్ దొరక్కుండా వెళ్ళిపోయాడు. వాడు బాగా ధనవంతుడు, బ్యాంకులో డబ్బులని పేద ప్రజలకి ఎందుకు పంచిపెడతాడు? మీకు అర్థం అవుతోందా? అప్పుడు యేసు "సూది బెజ్జంలోంచి ఒంటెను బయటకి లాగవచ్చు, కానీ ధనవంతుడిని స్వర్గలోకంలోకి పంపలేము" అన్నాడు. ఎందుచేత అంటే వాడి మైండ్ అంతా ధనం తోటి ఐడెంటిఫై అయ్యి ఉంటుంది.

ఒక విషయం జ్ఞాపకం ఉంచుకోండి ప్రపంచం అభివృద్ధి అయిపోయింది, అభివృద్ధి అయిపోయింది అంటే టెక్నాలజీ అభివృద్ధి అయింది కానీ హ్యూమన్ మైండ్ ఏమీ కూడా evolve కాలేదు. అభివృద్ధి ఏమిటి అంటే టెక్నాలజీ అభివృద్ధి అయ్యింది. పూర్వం ఎద్దుల బండ్ల మీద ప్రయాణం చేస్తుంటే ఇప్పుడు రైళ్ళు వచ్చాయి, విమానాలు వచ్చాయి. ఇప్పుడు టెక్నాలజీ అభివృద్ధి అయ్యింది. సైన్సు అభివృద్ధి అయ్యింది కానీ హ్యూమన్ మైండ్‌లో ఉన్నటువంటి రాగద్వేషాలు, ఇష్టాలు, అయిష్టాలు, పూర్వకాలంలో ఏమున్నాయో, ఈనాటికి కూడా కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులు అదే విధంగా ఉన్నాయి. అభివృద్ధి అంటే టెక్నాలజీ అభివృద్ధి అయ్యింది కానీ హ్యూమన్ మైండ్ ఏమీ అభివృద్ధి కాలేదు. ఇంత టెక్నాలజీ అభివృద్ధి అయిపోయింది, ఇంత సైన్సు అభివృద్ధి అయిపోయింది, ఈ ప్రపంచం అభివృద్ధి అయిపోయింది అనుకునే ఈ టైములో కూడా మీకు పూర్వం భారత యుద్ధ కాలం నాడు మానవ మనస్తత్వం ఎలా ఉందో, ఈనాడు కూడా అలాగే ఉంది. అయితే అప్పుడు ఒక దుర్యోధనుడు ఉన్నాడు, ఇప్పుడు సందుకి ఒకడు దుర్యోధనుడు ఉంటున్నాడు. వీడు "నేను వెళ్ళిపోతాను, నేను తపస్సు చేసుకోవాలి, జపం చేసుకోవాలి వెళ్ళిపోతాను"

**మీరు గురువును ప్రేమిస్తున్నారు అంటే ఎవరినో ప్రేమిస్తున్నారు అనుకోవద్దు. మీ హృదయంలో ఉన్న పరమాత్మను మీరు ప్రేమిస్తున్నారు.**



అంటున్నాడు. "నువ్వు ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోయే ప్రారబ్ధం నీ దేహంలో ఉంటే, నీ దేహ ప్రారబ్ధం అలా ఉంటే నన్ను ఇటువంటి ప్రశ్నలు అడగవు. ఆ ప్రారబ్ధం ఉంటే అసలు చెప్పకుండా వెళ్ళిపోతావు" అంటున్నారు భగవాన్, మన దేహం ప్రారబ్ధం ప్రకారం నడుస్తుంది. ఇల్లు విడిచిపెట్టి వెళ్లిపోవాలి అనే తలంపు వచ్చినా, నీ ప్రారబ్దంలో లేకపోతే నువ్వు వెళ్ళలేవు. నీకు ఇంటివద్ద ఉండే ప్రారబ్ధం ఉందనుకో, ఇల్లు విడిచి వెళ్ళిపోదాం అనే తలంపు కానీ, కోరిక కానీ, నీ ప్రారబ్ధాన్ని గెంటేసే అంత strength అవి ఇవ్వవు. Nothing is too heavy for destiny. ఆ దేహ ప్రారబ్ధం ఎలా ఉంటే అలా జరిగిపోతూ ఉంటుంది, ఆ ప్రారబ్ధం యొక్క ప్రవాహంలో నీ తలంపులు, నీ కోరికలు కొట్టుకునిపోతాయి. గృహపరిత్యాగం చెయ్యాలని నీకు తలంపు ఉన్నప్పటికీ, నీ దేహ ప్రారబ్దంలో గృహ పరిత్యాగం లేకపోతే నువ్వు గృహానికి అలా బంధింపబడి ఉండవలసిందే.

స్వామి వివేకానంద "you called yourself as householders, what house can hold you?" అనేవారు. మేము గృహస్థులం, గృహస్థులం అని అందరూ అంటారు. ఏ గృహం వచ్చి మిమ్మల్ని పట్టుకుంది. గృహాన్ని మీరు పట్టుకున్నారు కానీ గృహం వచ్చి మిమ్మల్ని పట్టుకోలేదు. మీరు జిన్నూరు వస్తున్నారు అనుకోండి రమణ క్షేత్రానికి వెళ్ళకండి అని మీ ఇల్లు ఏదైనా చెప్పిందా మీకు. మీరు ఇంటిని పట్టుకున్నారు కానీ ఇల్లు మిమ్మల్ని పట్టుకోలేదు. దేహం ప్రారబ్ధం ప్రకారం నడుస్తుంది, desire does not give you strength. నేను గృహాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతాను అని ఒకవేళ నీకు తలంపు వచ్చినంత మాత్రం చేత, ఆ desire వచ్చినంత మాత్రం చేత నీకు శాంతి వచ్చేయదు.

కృష్ణుడు గీతలో నిగ్రహః కిం కరిష్యతి అన్నాడు. అంటే ప్రారబ్ధం అతివేగంగా ఉన్నప్పుడు నీ నిగ్రహం కూడా దానిని అడ్డుకోలేదు. గోదావరికి వరద వచ్చేస్తోంది అనుకోండి, మనం నాలుగు తట్టల ఇసుక తీసుకెళ్తే ఆగుతుందా! రాగద్వేష ప్రవాహం అటువంటిది. ప్రారబ్ధం కేవలం దేహానికే పరిమితం. ఆ ప్రారబ్ధం ఎలా ఉన్నప్పటికీ, మంచిది అయినప్పటికీ, చెడు

అయినప్పటికీ, దానితో నువ్వు తాదాత్మ్యం చెందకుండా కనుక ఉంటే, నువ్వు అంతర్ముఖుడవు అవుతావు. దేహం ఏ ప్రారబ్ధం అనుభవించడానికి వచ్చిందో, ఏ పని చెయ్యడానికి వచ్చిందో, ఆ పని పూర్తి అయిన తరువాత ఒక్క క్షణం కూడా ఆగమంటే ఆగదు.

రమణమహర్షి గారి దగ్గరకి ఒక భక్తుడు వచ్చి ఏవండీ ఈ ప్రపంచం అంతా ఏమైపోతుంది, ఈ ఊరంతా ఏమైపోతుంది, ఇది ఏమైపోతుంది, అది ఏమైపోతుంది అంటే భగవాన్ అనేవారు "ఈ ప్రపంచం నువ్వు పుట్టిన తరువాత రాలేదు, నువ్వు పుట్టకముందు కూడా ఈ ప్రపంచం ఉంది. నువ్వు చనిపోయిన తరువాత కూడా ఈ ప్రపంచం ఉంటుంది. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచాన్ని ఎవడైతే చూశాడో నువ్వు చనిపోయిన తరువాత కూడా ఈ ప్రపంచాన్ని వాడే చూస్తాడు. ఈ ప్రపంచం నీదీ కాదు, నాదీ కాదు. ఈ ప్రపంచానికి కంట్రోలర్ ఒకడు ఉన్నాడు. అది తెగిపోయిన గాలిపటంలా లేదు. ఒక హయ్యర్ పవర్ కంట్రోల్ లో ఈ వరల్డ్ అంతా ఉంది. ఒకొక్కసారి మనం అలా జరుగుతుంది, ఇలా జరుగుతుంది అనుకుంటాం. సడన్‌గా పరిస్థితి తారుమారు అయిపోతూ ఉంటుంది. కొంతమంది ఒక తరంలో కోటీశ్వరులుగా ఉంటారు, మరుసటి తరం వచ్చేటప్పటికీ దరిద్రం అనుభవిస్తూ ఉంటారు. అది డెస్టినీ. ఆ డబ్బు ఎలా వచ్చిందో మనకి తెలియదు, ఎలా పోయిందో మనకి తెలియదు. అది దేహప్రారబ్ధం. ప్రారబ్ధాన్ని బట్టి దేహం యొక్క చేష్టలు ఉంటాయి. ఇది బాగా అర్థం చేసుకోండి. దేహం ఎప్పుడు ఎక్కడ ఎలా ఉండాలో తిరుగాడడం అనేది, దేహం యొక్క ప్రారబ్ధమే నిర్ణయిస్తుంది. కానీ దేహం యొక్క చేష్టల తోటి నువ్వు తాదాత్మ్యం పొందడం, పొందక పోవడం అనేది మటుకు నీ చేతిలో ఉంది. పరమేశ్వరుడు నీకు ఆ స్వేచ్ఛని ఇచ్చాడు, నువ్వు దేహం తోటి తాదాత్మ్యం పొందావా నీకు కొత్త వాసనలు వస్తాయి, దేహం తోటి తాదాత్మ్యం పొందడం మానేశావా పాత వాసనలు అన్నీ పోతాయి, కొత్త వాసనలు కొత్తగా వచ్చి కలవవు. అంటే వాసనారాహిత్యం పొంది, పునర్జన్మ లేని స్థితిని పొందుతావు."

# మహాత్ముల ప్రేమ

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

రమణమహర్షి, రామకృష్ణుడు, యేసు వంటి మహాత్ములు చెప్పినవి మాటలు కాదు, అది ప్రేమ. మానవజాతి మీద వాళ్లహృదయంలో ప్రేమ పొంగి, పొంగి, ఆ ప్రేమ ప్రవాహం మాటలరూపంలో బయటకు వచ్చింది – అది అక్షరమణమాల అనండి, Gospel of Sri Rama Krishna అనండి, లేకపోతే వేదం అనండి. లేకపోతే బైబిల్ అనండి, వాళ్ళు వ్యాపారం కోసం, గొప్పల కోసం, గౌరవాల కోసం చెప్పిన మాటలు కాదు. మానవజాతిని వాళ్ళ స్థాయికి తీసుకువెళ్ళడం కోసం, మానవుడు శారీరకంగా, మానసికంగా పడుతున్న బాధల నుండి విడుదలచేయటం కోసం, వాళ్ళు తపనపడి, తపనపడి కేవలం మానవజాతి మీద ఉన్న ప్రేమకొలది వాళ్ళ హృదయంలో నుండి పొంగినటువంటి మాటలు అవి. ఎవడైతే జ్ఞానం సంపాదించాడో వాడు ప్రేమస్వరూపుడు అవుతాడు, స్వార్థం నుండి విడుదల పొందుతాడు. స్వార్థం ఉన్న మనిషికి జ్ఞానం కలగదు. స్వార్థం ఉన్న మనిషి ప్రేమించలేడు. మీరు లోకాన్ని ప్రేమించాలి అంటే, ఈశ్వరుడిని ప్రేమించాలి అంటే, స్వార్థం అనే గూడు లోంచి ఆ మనిషి బయటకిరావాలి.

ఒకసారి పూరిజగన్నాథంలో శ్రీ కృష్ణచైతన్య, జగన్నాథస్వామిని చూస్తున్నారు. జనం ఎక్కువగా ఉన్నారు వాళ్ళు అందరిని గెంటుకు వెళ్ళడం ఎందుకు అని, అలా కూర్చుని ఉన్నాడు. ఈలోపు ఒక అమ్మగారు తల పైకెత్తి చూస్తోంది ఎదురుగా జనం, ఆవిడకి జగన్నాథస్వామి కనపడటం లేదు, చూడాలని లోపల ఆత్రుత. చైతన్యుడు అక్కడ కూర్చొని ఉన్నాడు కదా, ఎవడో దూడలు కాచుకునే కుర్రవాడిలాగా ఉన్నాడు. ఆ అమ్మగారు చైతన్యుడు భుజాల మీద ఎక్కి నుంచుంది. ఆయన శ్రీ కృష్ణచైతన్యుడు అన్న సంగతి ఈ అమ్మగారికి తెలియదు. అప్పుడు చైతన్యుడు, పాపం జగన్నాథస్వామిని ఆవిడ చూస్తోంది మనం

కదలకూడదు అని అలాగే కూర్చొన్నాడు. ఈ లోపల చైతన్యస్వామి శిష్యులు అక్కడకు వచ్చారు. ఇదేమిటి చైతన్యుడు మహాపురుషుడు, అవతారపురుషుడు, కృష్ణుడి యొక్క అవతారం, ఎవరీ అమ్మగారు, చైతన్యుడి మీద నిలబడి రథం చూస్తోంది అని తిట్టడానికి సిద్ధపడి దగ్గరకు రాబోతుంటే ఆమెను ఏమి కదపకండి అని చేతులతో వారించాడు. అప్పుడు శిష్యులు అలాగే ఉండిపోయారు. ఆవిడ ఒక ఐదు నిముషాలు, పది నిముషాలు ఆ జగన్నాథస్వామి వంక చూసింది. చూసి హమ్మయ్య! ఎంత బావుందో అనుకుని ఆ కాళ్ళు కింద పెట్టింది. ఈ శిష్యులకి ఏమో విపరీతమైన కోపం వచ్చేస్తోంది. ఆయన మన గురువు, మనకు దేవుడుతోటి సమానం, ఆయనని మనం పూజించుకుంటున్నాం అని శిష్యులకి ఎంతో కోపం వచ్చేస్తుంటే, ఆ ఎక్కిన అమ్మగారు ఈయన భుజాల నుంచి కాళ్ళు కింద పెట్టాక, చైతన్యుడు వెంటనే ఆవిడ కాళ్ళను పట్టుకుని నమస్కారం పెట్టి, అమ్మా మీ భక్తికి సంతోషం అమ్మా, కింద ఎవరు ఉన్నారో నీకు తెలియటం లేదు. ఆ విగ్రహాన్ని చూడాలని, భగవంతుడిని చూడాలని, ఎంతో ఆత్రుతగా చూశావు. నీ పాదాలకి నమస్కారం అమ్మా అన్నారు, భుజాల మీదకి ఎక్కినందుకు కోపం ఏమి రాలేదు పైగా తిరిగి ఆవిడ పాదాలకు నమస్కారం పెట్టాడు. ఆవిడకున్న భక్తికి ప్రణమిల్లాడు. అమ్మా నిన్ను ఆదర్శంగా తీసుకోవాలి. ఎంత భక్తురాలివి అమ్మా, నీ ఏకాగ్రతకి సంతోషం అమ్మా, నీ హృదయంలో పరమేశ్వరుడు పట్ల నీకు ఉన్న ప్రీతికి సంతోషం అమ్మా, అని ఆవిడ పాదాలకి శ్రీ కృష్ణ చైతన్యుడే నమస్కరించాడు. అది జ్ఞాని యొక్క లక్షణం.

జీవుల యొక్క అజ్ఞానాన్ని తొలగించటం కోసం, ప్రతీ మనిషిని జ్ఞానిని చెయ్యటం కోసం, ఈ ప్రకృతి లోంచి, ఈ విషవలయం లోంచి మానవుడిని బయటకు తీసుకు రావటం కోసం, మనసుని లోపలకి పంపించటం కోసం మహాత్ములు దేహం ధరించి ఈ భూమి మీదకి వచ్చారు. నిజంగా నీ అదృష్టం బావుండి,మీ పూర్వ జన్మ సుకృతం బాగుండి,ఎవరైనా మహాత్ముల సహవాసం మీకు దొరికితే మీకు అతి తేలికగా మోక్షం వస్తుంది.



ఓం శ్రీ నాన్నపరమాత్మనే నమః

**29 జూలై, 2026 బుధవారం గురుపౌర్ణమి** సందర్భంగా

**జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో**

## జరుగు కార్యక్రమములు

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00 లకు | **పారాయణం** |
| ఉ॥ గం॥ 6-45 ని॥లకు | **శేష మరియు నెమలి వాహనాల పై గిరి ప్రదక్షిణ** |
| ఉ॥ గం॥ 7-00 లకు | **అల్పాహారం** |
| ఉ॥ గం॥ 7-30 ని॥లకు | **పూజా కార్యక్రమములు** |
| ఉ॥ గం॥ 9-00 ల నుండి | **సత్సంగములు** |
| ఉ॥ గం॥ 11-00లకు | **అన్న ప్రసాదం** |
| మ॥ గం॥ 3-00 లకు | **సత్సంగములు** |
| సా॥ గం॥ 5-00 లకు | **పారాయణం** |
| సా॥ గం॥ 6-00 లకు | **పౌర్ణమి దీపోత్సవం** |

భక్తులందరకీ ఆహ్వానం

**శ్రీ రమణ క్షేత్రం జిన్నూరు**

# గురుపూర్ణిమ

పరమ గురువు వ్యాసుడి జన్మతిథి అయిన ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. గురుతత్త్వం, గురుఆరాధన, గురుపరంపర వ్యాసుడి నుండి వస్తున్నాయి. వ్యాసుని జన్మదినం ఆధ్యాత్మిక పర్వదినం, గురుభక్తులందరికీ ఓ పెద్ద పండుగ. ఆ రోజున గురుపూజ చేయడంలోని ఆంతర్యం తమ గురువును వేదవ్యాసుని రూపంగా పూజించడమే. శ్రీమహావిష్ణువే వేదవ్యాసునిగా అవతరించాడని చెబుతారు. అందుకే ఆయన వ్యాసభగవానుడు అయ్యాడు. వ్యాసభగవానుడు ఆత్మజ్ఞాన ఖని. ఎందరో మహాపురుషులు, తపస్సంపన్నులు, బ్రహ్మజ్ఞానులు ప్రవచించిన బ్రహ్మసూత్రాలను క్రోఢీకరించారు. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి వేదవ్యాసుడయ్యాడు. అష్టాదశ పురాణాలు, మహాభారతము, శ్రీమద్భాగవతములను ఘనమైన వారసత్వ సంపదలుగా మనకు అందించి మానవజాతికి ఎనలేని మేలు చేసారు. సకల ఉపనిషత్తుల సారము, యోగసాధనము, భక్తి-జ్ఞాన-వైరాగ్య సమన్వితము, పరమాత్మ ప్రబోధితము, అయిన భగవద్గీతను మనకు అనుగ్రహించారు. "గురువు లేకపోతే ఎవరు చూపుతారు మార్గం?" అని ప్రశ్నిస్తాడు కబీర్. అవతారపురుషులైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అంతటి వారికే గురువు ఉన్నారు. గురుమహిమ వర్ణనకు అతీతం, అట్టి మహోన్నత గురుమూర్తికి చేస్తున్న అర్చనే గురుపూర్ణిమ. మనకు నిజమైన బంధువు ఆత్మవిద్యను బోధించే సద్గురువు మాత్రమే. ఆత్మే గురురూపంలో జ్ఞానద్వారాన్ని తెరుస్తుంది. గురువుల యొక్క సారము వ్యాసుడు. వ్యాసుడంటే ఒక వ్యక్తి కాదు - గురు స్వరూపం, సర్వవ్యాపక చైతన్యం. గురువు, ఆత్మ, భగవంతుడు ఒక్కరే అని భగవాన్ శ్రీరమణమహర్షి చెప్పారు. సరియైన అర్హత, పక్వత లభించినప్పుడు గురువు ఒక మానవ రూపంలో మనకు లభిస్తారు. సద్గురువు లభించడం అనుగ్రహమే. మనలో దివ్యత్వం నివురుకప్పిన నిప్పులా ఉంది, గురువు ఆ నిప్పును రాజేస్తారు. మానవుడు వాస్తవంగా తానెవరో? తెలుసుకొనే మార్గాన్ని, అంతర్యాత్రను సుగమం చేసి తన పరమగమ్యాన్ని చూపించే పాత్రే సద్గురువు. శాస్త్ర, విజ్ఞాన, ఆధ్యాత్మిక స్వరూపాన్ని విపులీకరించి మన సనాతన సంస్కృతికి వ్యాసభగవానుడు చేసిన సేవ నిరుపమానం. అట్టి పరమ పూజనీయునికి మనము ఎంతో ఋణపడి ఉంటాం. అట్టి గురువుపట్ల కృతజ్ఞత చూపడానికే గురుపూర్ణిమ ఏర్పడింది. సద్గురువు శ్రీనాన్నగారి దివ్య సన్నిధిలో మనము అనేక గురుపూర్ణిమలు జరుపుకొని, ప్రత్యక్షంగా వారి తత్త్వబోధ శ్రవణం చేసి, పునీతులమయ్యాం. గురుపూర్ణిమ రోజున సద్గురుని ఆశీస్సును మనము పొందాలి.

**శివాయ గురవేనమః**

**(ది॥ 29-07-2026 గురు పూర్ణిమ సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**